సాక్షి మెదక్

సోమవారం ◆ 3 ◆ మార్చి ◆ 2025



సమైక్య జీవనతత్వం..

వరకవి సిద్ధప్ప తాత్విక రచనలపై సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రాజెక్టు రూపొందించారు. వివరాలు 8లో ▸



ఫాసిజం పెరిగిపోతోంది

దేశంలో ఫాసిజం పెరిగిపోతోందని ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమవారం	మంగళవారం
సా. 6.28 గం.	ఉ. 5.10 గం.

న్యూస్‌రీల్

ఏడుపాయలలో భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆదివారం జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు రాలేని వారు ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో ధర్మసత్రాలు దొరకక ఇబ్బంది పడ్డారు. చెట్ల కింద టెంట్లు వేసుకొని విందు చేసుకున్నారు. వాహనాల రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈఓ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా బుదేరా

మంత్రి దామోదర రాజనర్సింహ



వైదిక పాఠశాల మ్యాపును పరిశీలిస్తున్న మంత్రి దామోదర

మునిపల్లి(అందోల్): ఆధ్యాత్మిక కేంద్రంగా బుదేరాను తీర్చిదిద్దుతామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండలంలోని బుదేరా శివారులో గల హనుమాన్ దేవాలయం వద్ద వైదిక పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బర్దిపూర్ దత్తాత్రేయ పీఠాధిపతి అవధూత గిరి మహరాజ్ మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం బుదేరా శివారులో వైదిక పాఠశాలను ఏర్పాటు చేసి కులమతాలకతీతంగా పిల్లలకు వేదాలు నేర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిద్దేశ్వర్ మహరాజ్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ మనోహర్ యాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సతీష్ కుమార్, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి తారా అధ్యాపకుడు



జగదీశ్వర్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జగదీశ్వర్ ఒడిశాలో జరిగే ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె ఎస్ రత్నప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో ఒడిశా ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిబిరానికి రాష్ట్రం నుంచి ఆరుగురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కలిగిన బృందం బయలుదేరుతుందని, ఈ బృందానికి కాంటినెంట్ లీడర్‌గా తమ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జగదీశ్వర్ వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు జరుగుతుందన్నారు. జాతీయ సమైక్యత శిబిరానికి తమ కళాశాల అధ్యాపకుడు ఎంపిక కావడం పట్ల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసింది.

క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు టి.రాజు అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొల్లూరు ఢీల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరిగిన రాష్ట్ర ఆర్చరీ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేయలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలలో రాణించే వారికి విద్య, ఉపాధి, ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్‌లు ఉంటాయని చెప్పారు. ఈ పోటీలలో సుమారు 500 మంది పాల్గొన్నారన్నారు. అందులో ఎంపికైన వారు ఈనెల 22న విజయవాడలో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ క్రీడాల్లో పాల్గొంటారని చెప్పారు.



ఐఐటీ క్యాంపస్ ఆవరణలో మొక్క నాటుతున్న ఉప రాష్ట్రపతి తదితరులు



ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ జ్ఞాపిక అందజేస్తున్న ఐఐటీ డైరెక్టర్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఐఐటీ హైదరాబాద్‌లో ఉప రాష్ట్రపతి పర్యటన

సంగారెడ్డి జోన్: భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో పర్యటించారు. ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ శర్మతో కలిసి క్యాంపస్‌ను సందర్శించారు. మధ్యాహ్నం సుమారు 3:15 నిమిషాలకు మూడు ప్రత్యేక హెలిక్యాప్టర్ల ద్వారా క్యాంపస్‌కు చేరుకున్నారు. క్యాంపస్‌కు వచ్చిన వారికి గవర్నర్, ఐఐటీ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ డాక్టర్ బీఆర్ మోహన్‌రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్, ఎంపీ రఘునందన్‌రావు, ఐఐటీహెచ్ డైరెక్టరు బీఎస్ మూర్తి, రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి, మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి పర్యటన ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగింది. క్యాంపస్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధికి ప్రోత్సహించే సంకేతంగా ఉప రాష్ట్రపతి భార్య డా.సుదేశ్ ధన్‌ఖడ్‌తో కలిసి ఏక్ పేడ్ మా కె నామ్ పేరుతో మొక్క నాటి నీరు పోశారు. అనంతరం క్యాంపస్ సభాస్థలి వెళ్లారు. జాతీయ గీతాలాపన చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐఐటీ డైరెక్టరు బీఎస్.మూర్తి ఉప రాష్ట్రపతితో పాటు గవర్నర్‌కు శాలువాతో సన్మానించి, జ్ఞాపికలను బహూకరించారు. ఐఐటీ డైరెక్టరు ఐఐటీ సాధించిన ముఖ్యమైన విజయాలను వివరించారు. ఐఐటీ విద్యార్థులతో ముచ్చటించి, విద్యార్థులతో కలిసి ఫొటోలు దిగారు. అనంతరం ప్రత్యేక హెలిక్యాప్టర్లలో సుమారు 4:30 నిమిషాలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు.

ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు నాకు అతిథులు

ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు తనకు అతిథులని, పార్లమెంట్‌ను సందర్శించాలని ఉపరాష్ట్రపతి కోరారు. భారత దేశం వివిధ భాషల నిలయమని చెప్పారు.

తారాజువ్వలెత్తిస్తున్న ఎండలు

మెదక్ మున్సిపాలిటీ: వేసవి ప్రారంభంలోనే ఎండలు తారాజువ్వలెత్తిస్తున్నాయి. ఉదయం పది దాటిందంటే చాలు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జనం బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. మధ్యాహ్నం అనూహ్యంగా ఎండలు దంచి కొడుతుండటంతో 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఇళ్లలో ఉన్న జనాలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఇక మూలన పడి ఉన్న కూలర్లకు, ఫ్యాన్లకు పని చెబుతున్నారు.



ఎండలో ప్రయాణం

పక్కాగా పంటల నమోదు

కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే



ఔరంగాబాద్ శివారులో డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్న ఏఈఓ రాకేశ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో పంటల నమోదు పక్కాగా జరుగుతోంది. ప్రతి రైతుకు ప్రయోజనం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఫిబ్రవరి మొదటి వారం నుంచి జిల్లాలో వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. సర్వే నంబర్ల ఆధారంగా సాగు వివరాలు, పంటల ఫొటోలు యాప్‌లో పొందుపరుస్తున్నారు.

ఒక్కో అధికారికి 2 వేల ఎకరాలు

జిల్లాలో మొత్తం 21 మండలాలు, 493 గ్రామాలు ఉండగా.. వీటిని వ్యవసాయ అధికారులు 76 క్లస్టర్లుగా విభజించి డిజిటల్ సర్వే ప్రారంభించారు. ఇందులో మొత్తం 1,49,593 ఎకరాల్లో సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ముమ్మరంగా సర్వే కొనసాగిస్తున్నారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు ఒక్కొక్కరికి 2 వేల ఎకరాలు సర్వే చేయాలని ఆదేశించారు. అయితే మహిళా అధికారులకు మాత్రం 1,800 ఎకరాల టార్గెట్ ఇచ్చారు. ఎవరైనా పంట వేయకుంటే నో క్రాప్ అని నమోదు చేస్తున్నారు. అయితే వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లినప్పుడు కొన్ని గ్రామాల శివారులో సిగ్నల్స్ సమస్య తలెత్తుతోంది. దీంతో డిజిటల్ సర్వే ఆలస్యం అవుతోంది. అయినప్పటికీ ఇప్పటివరకు 63,890 ఎకరాల్లో 40 శాతం సర్వే పూర్తయింది. ఇంకా జిల్లాలో 85,703 ఎకరాల విస్తీర్ణంలో పంటల నమోదు చేయాల్సి ఉంది. సిగ్నల్స్ సమస్యతో సర్వే జాప్యం అవుతున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రైతులకు ప్రయోజనాలు

జిల్లాలో జరుగుతున్న పంటల సాగు డిజిటల్ సర్వేతో రైతులకు అనేక ప్రయోజనాలు అందనున్నాయి. సర్వే ఆధారంగా ఎక్కడ, ఏ రైతులు ఏ పంట వేస్తున్నారనే విషయం ప్రభుత్వానికి తెలుస్తుంది. రైతులు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పి స్తుంది. అలాగే రైతులు ప్రకృతి విపత్తుల నుంచి నష్టపోకుండా పంటల బీమా వసతి కల్పించనుంది. పంట నష్టం అంచనా పక్కాగా ఉంటుంది.

20 రోజుల్లో పూర్తి చేస్తాం



జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే 40 శాతం పూర్తయింది. మిగితాది మరో 15, 20 రోజుల్లో పూర్తి చేస్తాం. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేకు శ్రీకారం చుట్టింది. ఈ సర్వే ద్వారా రైతులకు సబ్సిడీలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనోత్పత్తి , రైతుబీమా, భరోసా వంటి పథకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. సర్వే త్వరగా పూర్తయ్యేందుకు రైతులు అధికారులకు సహకరించాలి.

– వినయ్‌కుమార్, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్



ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగేలా సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నందున, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని ఆయా విభాగాలను సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డులు, హాజరుపట్టికను తనిఖీ చేశారు.

శ్రీపాదరావుకు నివాళి

మెదక్ కలెక్టరేట్: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రజల కోసం శ్రీపాదరావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుర్రపు డెక్కతో నిండిన ఎంఎన్ కెనాల్ కాలువ

కాలువ ఇలా.. సాగు ఎలా!

ఘనపూర్ ఆనకట్ట నుంచి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు సరఫరా అయ్యే కాలువలో గుర్రపు డెక్క పేరుకుపోయింది. మండల పరిధిలోని ఎంఎన్ కెనాల్ ద్వారా ముత్తాయికోట, కూచన్‌పల్లి, ముత్తాయిపల్లి, సర్దన, ఫరీద్‌పూర్, పోచమ్మరాల్ గ్రామ శివారులోని పొలాలకు సాగునీరు సరఫరా అవుతుంది. దీంతో కూచన్‌పల్లి వద్ద కాలువలో గుర్రపు డెక్క పేరుకుపోయి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందక ఇబ్బంది పడుతున్నారు. కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి సాఫీగా సాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

– హవేళిఘణాపూర్(మెదక్)

వందలాది కోళ్ల మృత్యువాత



మృతిచెందిన కోళ్లు

కొల్చారం(నర్సాపూర్): గంటల వ్యవధిలోనే వందలాది కోళ్లు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని నాయిని జలాల్‌పూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన సతీష్‌గౌడ్ ఉపాధి కోసం కొన్నినెలల క్రితం పౌల్ట్రీ ఫాం ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ఆదివారం ఏం జరిగిందో ఏమో ఒక్కసారిగా ఫాంలోని కోళ్లు ఒక్కొక్కటిగా మృత్యువాత పడసాగాయి. దీంతో అప్రమత్తమైన యజమాని మిగితా కోళ్లకు ప్రమాదం జరగకుండా వాటిని వెంట వెంటనే తొలగించారు. సుమారు 1,000 కోళ్లు మృత్యువాత పడ్డాయని, సుమారు రూ. 2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. అయితే ఒక్కసారిగా వందలాది కోళ్లు మృత్యువాత పడటంతో బర్డ్ ఫ్లూ వచ్చిందేమోనని గ్రామస్తులు ఆందోళన చెందారు. ఈ విషయమై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్యను వివరణ కోరగా.. జిల్లాలో ఇప్పటివరకు ఒక్క బర్డ్ ఫ్లూ కేసు నమోదు కాలేదని.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం పౌల్ట్రీ ఫాంను సందర్శించి నిర్ధారణ చేస్తామని తెలిపారు.

సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

హుస్నాబాద్: వ్యవసాయ మార్కెట్ యార్డులో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పంట చేతికి వస్తున్నా కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయలేదన్నారు. సన్ ఫ్లవర్ క్వింటాలుకు రూ.6వేలు మద్దతు ధర నిర్ణయించిందన్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటులో జాప్యం జరుగుతుండటంతో దళారులు క్వింటాలుకు రూ. 5 వేలకే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం చొరవ తీసుకొని వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

‘రిజర్వేషన్ల ప్రాతిపదికనే నామినేటెడ్ పదవులు’

వర్గల్(గజ్వేల్): వివిధ నామినేటెడ్ పదవులను రిజర్వేషన్ల ప్రాతిపదికన భర్తీ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం వర్గల్ మండలం గౌరారం ఎస్సీవాడలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యేగా కేసీఆర్ ఇక్కడి సమస్యలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, సీఎం రేవంత్‌రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నారన్నారు. కార్యకర్తలు ప్రతిఒక్కరూ పార్టీకి విధేయులై పనిచేయాలని, క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణం.. ఇక వేగవంతం

మండలానికో ఇందిరమ్మ మోడల్ హౌస్



రామాయంపేటలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకరంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరో ముందుడుగు పడింది. ఈమేరకు జిల్లాలోని మండల కేంద్రాల్లో రూ. ఐదు లక్షలతో ఇందిరమ్మ మోడల్ హౌస్‌లు నిర్మించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు, వాటిని నిర్మించే మేస్త్రీలకు అవగాహన కల్పించడానికి వీలుగా వీటిని నిర్మించనున్నారు. జిల్లాలో మొదటి విడతలో పది మండలాల్లో మోడల్ హౌస్‌లు మంజూరయ్యాయి. ప్రస్తుతం రామాయంపేట, మెదక్, టేక్మాల్, పాపన్నపేట, రేగోడ్‌లో ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గృహ నిర్మాణ శాఖ అధికారులు దగ్గరుండి నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు. నిర్మాణ దశలో ఉన్న మోడల్ హౌస్‌లను లబ్ధిదారులు చూసి వెళ్తున్నారు. రూ. 5 లక్షలతో ఎలా ఇళ్లు నిర్మించాలన్న విషయమై అవగాహన కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇదే విషయమై గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఈఈ యాదగిరి మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు అవగాహన కల్పించడానికిగాను ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో మోడల్ హౌస్‌లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈమేరకు ఐదు మండల కేంద్రాల్లో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. మిగితా మండలాల్లో సైతం త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



స్వామివారి రాజగోపురం ఎదుట భక్తజన సందోహం



పట్నాలు వేసి భక్తుల మొక్కులు

మల్లన్న క్షేత్రం.. భక్తజనసంద్రం

కొమురవెల్లి మల్లన్న క్షేత్రం భక్తజన సంద్రమైంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో ఆదివారం భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ పరిసరాలన్నీ సందడిగా మారాయి. స్వామి వారి దర్శనానికి సుమారు 40 వేల మంది వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వేకువజామునుంచే పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గంగిరేణి చెట్టువద్ద పట్నాలువేసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కొండపైన ఉన్న రేణుక ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)

క్లుప్తంగా

పొద్దుతిరుగుడు ధాన్యం చోరీ



మిగిలిన కొద్దిపాటి పొద్దు తిరుగుడు ధాన్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): రోడ్డుపై ఆరబెట్టిన పొద్దు తిరుగుడు ధాన్యం చోరీకి గురైంది. ఈ ఘటన చిన్నకోడూరులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జంగిటి రాజు, కోరబోయిన శ్రీనులు చిన్నకోడూరు మార్కెట్ కమిటీ ఆవరణలో పంటను ఆరబోశారు. సాయంత్రం టార్పాలిన్ కవర్లు కప్పి ఇంటికి వచ్చారు. ఉదయం వెళ్లగా కవర్లు తీసి ఉన్నాయి. జంగిటి రాజుకు చెందిన 8 క్వింటాళ్లు, కోరబోయిన శ్రీనుకు చెందిన 2 క్వింటాళ్లు పొద్దుతిరుగుడు ధాన్యం దుండగులు ఎత్తుకెళ్లారు. సుమారు రూ. 50 వేల నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 28వ తేదీన చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గుర్తుతెలియని వ్యక్తి కిందపడిపోగా.. అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు చెప్పారు. అదే రోజు సాయంత్రం అతడు మృతి చెందాడని.. ఆదివారం వరకు అతని బంధువులు వస్తారని చూసినప్పటికీ ఎవరూ రాకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో రెండు దూడలు మృతి

మద్దూరు(హుస్నాబాద్): వీధి కుక్కల దాడిలో రెండు దూడలు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని లద్నూర్‌లో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కర్రె స్వామి తన వ్యవసాయ బావి వద్ద రెండు దూడెలను ఎప్పటి మాదిరిగానే కట్టేసి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు తెల్లవారుజామున వెళ్లి చూడగా దూడలపై కుక్కలు దాడి చేసి చంపాయి. ఈ ఘటనతో రూ.20వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు స్వామి వాపోయాడు. వీధి కుక్కలు గ్రామంలో స్వైరవిహారం చేస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

రెండు బైక్‌లు ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి(తూప్రాన్): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మాసాయిపేట జాతీయ రహదారి 44పై ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివ బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ బలంగా ఢీకొంది. దీంతో శివ తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం



తనిఖీలు చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పలువురిని సంగారెడ్డి పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ రమేష్ మాట్లాడుతూ.. ఆదివారం సాయంత్రం పట్టణంలో విస్తృత సోదాలు నిర్వహించారు. పలు వాహనాల పత్రాలు పరిశీలించారు. మందు తాగిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని సోమవారం సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

సమైక్య జీవనతత్వం సిద్ధప్ప కవిత్వం

పరిశోధన అంటే ఒకప్పుడు కేవలం సైన్స్ టెక్నాలజీకి మాత్రమే చెందిందనే భావన ఉండేది. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల తెలుగు విభాగం విద్యార్థులు సామాజిక అంశాలపై సైతం పరిశోధన చేస్తామని ముందుకు వచ్చారు. వరకవి సిద్ధప్ప తాత్విక రచనలు, భజన మండళ్ల సేవా కార్యక్రమాలపై ప్రత్యేకంగా పరిశోధించి ప్రాజెక్టును రూపొందించారు. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు రూపొందించిన ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపికైంది.

– సిద్దిపేట ఎడ్యుకేషన్:

వరకవి రచనలపై డిగ్రీ విద్యార్థుల పరిశోధన

- రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపిక



వరకవి సిద్ధప్ప శిష్యులను కలిసి వివరాలను సేకరిస్తున్న విద్యార్థులు(ఫైల్)

సిద్దిపేట జిల్లా గుండారెడ్డిపల్లికి చెందిన రాజయోగి వరకవి సిద్ధప్ప తెలంగాణ తొలితరం పారమార్థక యోగులలో ఒకరు. ఈయన కీర్తనలు, పద్యాలు తెలుగులో విశేష ప్రాచుర్యం పొందాయి. రాష్ట్రవ్యాప్తంగా సిద్ధప్పకు శిష్యులు, వారి నిర్వహణలో ఆశ్రమాలున్నాయి. జ్ఞానయోగం, పారమార్థకత, ఆధ్యాత్మికత, నైతికవిలువలు, సంఘసంస్కరణ తదితర అంశాల్లో సిద్ధప్ప కవి చేసిన కృషిని ఆయన శిష్యులు దశదిశలా ప్రచారం చేసే అంశాలు, వర్తమాన సమాజానికి ఉపయోగపడుతున్న తీరుపై విద్యార్థులు అధ్యయనం చేసి రూపొందించిన ప్రాజెక్టుపై 'సాక్షి' కథనం...

నైతిక విలువలు, మానసిక ఆరోగ్యం భేష్..

పవన్, పూజిత, రాజు, భార్గవి తదితరులు గ్రామాన్ని, ఆశ్రమాన్ని సందర్శించి సిద్ధప్ప శిష్యులైన రాజారెడ్డి, కనకయ్య, మల్లయ్య తదితరుల నుంచి వివరాలను సేకరించారు. కీర్తనలు, పద్యాలు పాడించుకుని విషయాలను విశ్లేషించుకున్నారు. పరిసర గ్రామాలైన బిక్కనూరు, జంగంపల్లె, పల్వంచ తదితర గ్రామాల్లోని భజన మండళ్ల వ్యక్తులను ఫోన్లలో సంప్రదించి అధ్యయనం చేశారు. భజన మండళ్ల ద్వారా వరకవి సిద్ధప్ప తాత్వికతను ప్రచారం చేస్తున్న గ్రామాల్లోని భక్తుల ఆరోగ్యం, మానసిక, శారీరక స్థిరత్వం బాగుందని, గ్రామాల్లో సామాజిక ఐక్యత, ప్రశాంత జీవనం, నైతిక విలువలు బాగున్నాయనే అంశాలు వీరి పరిశోధనలో తేలాయి. సివిల్, క్రిమినల్ కేసులు, కక్షలు, అల్లరు తక్కువగా నమోదైనట్లు విద్యార్థులు తమ పరిశోధన ద్వారా నిర్ధారణ చేశారు.

పరిశోధన అంటే ఏమిటో తెలిసింది



జిజ్ఞాసలో భాగంగా వరకవి సిద్ధప్ప తాత్విక విస్తృతి భజన మండళ్ల సేవ అనే ప్రధానాంశం ద్వారా మేం చేపట్టిన ప్రాజెక్టు కోసం క్షేత్రస్థాయిలో పర్యటించాం. ఫలితంగా పరిశోధన అంటే ఏమిటి, అందులో పాటించాల్సిన పద్ధతులు, క్షేత్రస్థాయిలో వ్యక్తులను ఇంటర్వ్యూ చేసే విధానాల గూర్చి తెలుసుకున్నాను. తాత్వికత, భజన గేయాలు, సంకీర్తనల ద్వారా గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందనే విషయాన్ని మా పరిశోధన ద్వారా తెలుసుకున్నాము.

– నిఖిత, బీజడ్‌సీ తృతీయ సంవత్సరం

అనేక అంశాలు తెలుసుకున్నాం



ఈ ప్రాజెక్టులో భాగంగా మేము కవి సిద్ధప్ప గ్రామానికి చేరుకుని ఆయన శిష్యులను, కుటుంబ సభ్యులను, గ్రామ ప్రజలను ప్రత్యక్షంగా కలిసి కవిజీవితానికి సంబంధించిన అనేక విషయాలను తెలుసుకున్నాం. ముఖ్యంగా కవి తాత్విక చింతన, రచనలు, గ్రామదేవతల దండకాలు దేశభక్తి సంకీర్తనలు అనేక అంశాలను గూర్చి తెలుసుకున్నాం.

– పవన్ ప్రహ్లాద్, ఎంబీజడ్‌సీ ద్వితీయ సంవత్సరం

ఎంపిక కావడం సంతోషం



ఆధునిక కాలంలో కూడా భజన మండళ్లు చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి తెలుసుకోవడం బాగుంది. మా ప్రాజెక్టు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపిక కావడం సంతోషం. క్షేత్రస్థాయి పర్యటనతో వాస్తవాలను దగ్గర్నుంచి తెలుసుకునే అవకాశం కలిగింది. వరకవి సిద్ధప్ప తత్వాన్ని ప్రచారం చేస్తున్న భజన మండళ్ల సభ్యులను కలసి వివరాలను సేకరించాం. ఇందుకు సహకరించిన మా తెలుగు విభాగాధిపతి సంపత్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.సునీతకు ప్రత్యేక ధన్యవాదాలు.

– కాముని పూజిత, బీజడ్‌సీ తృతీయ సంవత్సరం

పరిశోధన అభిరుచిని పెంపొందిస్తుంది



జిజ్ఞాస అనేది చక్కని కార్యక్రమం. డిగ్రీ స్థాయి విద్యార్థులకు పరిశోధన అభిరుచిని పెంపొందిస్తుంది. తమ పరిసరాల్లోని అంశాన్ని స్వీకరించి పూర్వాపరాలను, ప్రాధాన్యతను, ఫలితాన్ని, సమస్య పరిష్కార మార్గాలను కనుగొనే శక్తియుక్తులను జిజ్ఞాస కార్యక్రమం విద్యార్థులకు అందిస్తుంది. వరకవి సిద్ధప్ప తాత్వికత, భజనమండళ్ల సేవను వర్తమాన జీవితానికి అనుసంధానించి, విశ్లేషించి ఫలితాలను సమాజానికి అందించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి, ప్రాజెక్టు పర్యవేక్షకుడు, తెలుగు విభాగాధిపతి

పశువులకు వైద్యం చేసేందుకు వెళ్తుండగా..

రోడ్డు ప్రమాదంలో గోపాలమిత్ర మృతి



వెంకట్ రెడ్డి(ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): పశువులకు వైద్య పరీక్షలు చేయడానికి వెళ్తున్న గోపాలమిత్రను ఆర్టీసీ బస్ వెనుక నుంచి ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రామునిపట్ల వద్ద రాజీవ్‌రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లికి చెందిన మార్గాడి వెంకట్‌రెడ్డి(50) వెటర్నరీ డిపార్ట్‌మెంట్‌లో గోపాలమిత్రగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగా బైక్‌పై ఇబ్రహీంనగర్‌లో పశువులకు వైద్య పరీక్షలు చేయడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామునిపట్ల శివారులో కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొంది. దీంతో వెంకట్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

• కుస్తీమే సవాల్



నారాయణఖేడ్: తలపడుతున్న మల్లయోధులు



కల్హేర్: నల్లవాగులో..

కల్హేర్/నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం నల్లవాగులో నల్లపోచమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కుస్తీపోటీలు నిర్వహించారు. చుట్టూ పక్క గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. విజేతకు 5 తులాల వెండి కడెం బహుమతి అందజేశారు. కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, గ్రామస్తులు శ్యాంప్రసాద్, గుడిసె విఠల్, భూషణం, మాధవరావు, అశోక్ పాల్గొన్నారు.

మాద్వార్‌లో..

మండలంలోని మాద్వార్‌లో దుర్గాభవానిమాత జాతరలో భాగంగా కుస్తీపోటీలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. చివరిపోటీ విజేతకు గ్రామపెద్దలు వెండి కడియం బహూకరించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి మహానైవేద్యాల సమర్పణ, మాణిక్యాలదేవి నాటకం చివరి భాగం ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

కారును ఢీకొట్టిన టిప్పర్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సదయ్య

హుస్నాబాద్‌రూరల్: పోతారం(ఎస్)లో కారును ఇసుక టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం పోతారం నుంచి హుస్నాబాద్ వైపు వస్తున్న కారును టిప్పర్ ఢీకొట్టింది. దీంతో కారు పక్కగా వెళ్తున బైక్ పై పడిపోయింది. బైక్ పై ఉన్న పోతారం గ్రామానికి చెందిన సదయ్యకు తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్నవారికి స్వల్పగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలతో నవీన్

అక్కన్నపేట(హుస్నాబాద్): వెనక నుంచి ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. మోత్కులపల్లికి చెందిన ఏనుగుల నవీన్(26) అనే యువకుడు బైక్‌పై మల్లంపల్లి నుంచి మోత్కులపల్లికి వస్తున్న క్రమంలో వెనక నుంచి బండరాళ్ల లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. సుమారు 10మీటర్ల మేర రోడ్డుపై ఈడ్చికెళ్లినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో నవీన్‌కు చాలాచోట్ల గాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్ సహాయంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.



టీపీటీఎఫ్ విద్యా సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కాశీం

దేశంలో ఫాసిజం పెరిగిపోతోంది

- బేడీలు వేసి వెనక్కిపంపుతున్న దేశంతో సాగిలపడటమా?
- ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం

గజ్వేల్: బేడీలు వేసి వెనక్కిపంపుతున్న దేశం తీరుపై నోరుమెదపకకుండా, చర్చల కోసం సాగిలపడటం ఏంటని, దేశ భక్తి అంటే ఇదేనా? ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం ప్రశ్నించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో రిమ్మనగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజులు పదవీవిరమణ సందర్భంగా టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సదస్సు స్థానికంగా జరిగింది. ఈ సదస్సుకు ప్రధాన వక్తగా హాజరైన కాశీం 'సంక్షోభ కాలంలో మేధావుల పాత్ర' అంశంపై ప్రసంగించారు. దేశంలో ఫాసిజం పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ధోరణికి అడ్డుకట్టవేయడానికి మేధావులు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. లేదంటే తీవ్ర పరిణామాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు తమ సంఘం బాసటగా నిలుస్తుందని చెప్పారు. ప్రత్యేకించి గజ్వేల్‌లోని తమ సంఘ సభ్యుల పనితీరు ఎందరికో ఆదర్శమని అభిప్రాయపడ్డారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యారంగాన్ని ప్రైవేటీకరించే ఆలోచనలను మానుకొని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ జే.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఏ. నర్సింహ్మారెడ్డి, రాంచంద్రం, వై.అశోక్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌తోపాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



బేస్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జట్టుకు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్వేత

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని, ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలని బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్వేత అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) పక్కనగల మైదానంలో బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 5వ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లా) చాంపియన్ షిప్ బేస్‌బాల్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములతో నిరాశ చెందవద్దని, ఓటమి విజయానికి మరో అవకాశం కల్పిస్తుందన్నారు. క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో రంగారెడ్డి, ద్వితీయ స్థానంలో మహబూబాబాద్, తృతీయ స్థానంలో నిజామాబాద్ జిల్లా జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిజామాబాద్, ద్వితీయ స్థానంలో నల్గొండ, తృతీయ స్థానంలో మేడ్చల్ జిల్లా జట్లు నిలిచాయి. విజేతలకు మెమెంటోలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ కృష్ణ, జిల్లా చైర్మన్ వెంకటేష్‌గౌడ్, సెక్రటరీ మధుయాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్‌గౌడ్‌తో పాటు డాక్టర్ స్వామి, దయాకర్‌రావు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



సునీల్ చౌహాన్ (ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటికి వస్తున్నానంటూ అమ్మనాన్నలకు ఫోన్ చేసిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ కథనం ప్రకారం.. నాగిల్‌గిద్ద మండలంలోని గంగారం తండాకు చెందిన చౌహాన్ విఠల్ కుమారుడు చౌహాన్ సునీల్(22) హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో పానీపూరి వ్యాపారం చేస్తున్నాడు. గత కొంతకాలంగా పచ్చ కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. ఇంటికి వస్తున్నానంటూ నాన్నకు ఫోన్ చేసి చెప్పాడు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం హద్నూర్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో రాఘవాపూర్ గ్రామశివారులో మంజీరా నదిపై నిర్మించిన పుల్‌కుర్తి బ్రిడ్జిపై పల్సర్ బైక్‌ను గుర్తించారు. బైక్‌ను స్టేషన్‌కు తరలించి బండి నంబర్‌ను ఆన్‌లైన్‌లో చెక్ చేయగా గంగారం తండాకు చెందిన సునీల్‌దిగా గుర్తించారు. వెంటనే సునీల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు మోటారు సైకిల్ తమ కుమారునిదేనన్నారు. బైక్‌పై వచ్చిన సునీల్ మంజీరా నదిలో దూకాడా? లేక వాహనం అక్కడ నిలిపి ఎక్కడైనా వెళ్లాడా అని అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా సునీల్‌కు ఈనెల 26న వివాహం జరగనుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి



సత్తయ్య (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులు, ఇంట్లో గొడవలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం నెంటూరులో జరిగింది. బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నెంటూరుకు చెందిన జంపాల సత్తయ్య(55)కు భార్య లక్ష్మి, శ్రీకాంత్, ఆంజనేయులు అనేఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అందరి వివాహాలు జరిగాయి. కులవృత్తితోపాటు, వ్యవసాయం చేసుకుంటారు. ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా ఇంట్లో గొడవలతో సత్తయ్య మనస్తాపానికి గురయ్యాడు. శనివారం వ్యవసాయ పనుల నిమిత్తం భార్యతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పురుగుల మందు తాగుతుండగా భార్య గమనించింది. కొడుకులతో కలిసి స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కొంపల్లి వెల్‌నెస్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనతో కుటుంబం శోకసంద్రమైంది.

రాళ్లను తొలచి.. రోళ్లుగా మలిచి..

పొట్టకూటి కోసం కులవృత్తిని వదలలేక..


- రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి
- వలస జీవుల ఆకలి పోరాటం



దుబ్బాకలో రోళ్లు తయారు చేస్తున్న కార్మికులు

దుబ్బాకటౌన్: రాళ్లను తొలచి రోళ్లుగా మలిచే వృత్తి వారిది. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు. కాలం మారుతున్నా నమ్ముకున్న వృత్తిని వదలలేక జీవనం కొనసాగిస్తున్నారు. ఇతర పనులు రాక వచ్చిన వృత్తిపై నమ్మకంతో దుబ్బాకకు వలస వచ్చి పూరి గుడిసెలో జీవనం గడుపుతున్నారు. మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా.. వీరి జీవనశైలిలో మార్పు కానరావడం లేదు. మిక్సీలు, గ్రైండర్లకు డిమాండ్ పెరిగి పోవడంతో రోళ్లు, రోకళ్లకు ఆదరణ కరువైంది. కరీంనగర్ జిల్లాకు చెందిన పలు కుటుంబాలు రాళ్లను రోళ్లగా మలిచే వృత్తి చేసుకుంటూ..జీవనం సాగిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో వృత్తికి ఆదరణ లేకపోవంతో దుబ్బాకకు వలస వచ్చి బైపాస్ రోడ్డులో పూరి గుడిసెను ఏర్పాటు చేసుకుని భార్యా పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి ముడిరాళ్లను దిగుమతి చేసుకుని వాటిని తొలచి రోళ్లగా తయారు చేస్తున్నారు. ఒక్క రోజు కష్టపడితే ఒక్కో వ్యక్తి రోజుకు రెండు రోళ్లను తయారు చేస్తారు.


ఆశ్రయం కల్పించండి సారు



ఉండడానికి ఇళ్లు లేక రోడ్డు పక్కన టార్పాలిన్ కవర్లు కట్టుకుని భార్యా పిల్లలతో జీవనం సాగిస్తున్నాం. నిలువ నీడ లేక ఎండకు, చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల కష్టపడి తయారు చేసిన రోళ్లను దొంగలెత్తుక్కు పోయారు. ప్రభుత్వం ఆశ్రయం కల్పించి ఆదుకోండి.

– ఎల్లయ్య, కార్మికుడు

ప్రత్యేక కార్మికులుగా గుర్తించండి



మా కుల వృత్తికి ఆదరణ పూర్తిగా తగ్గింది. రోజుకు రెండు రోళ్లు అమ్ముడుపోతేనే మా పిల్లల కడుపు నిండుతుంది. మమ్మల్ని ప్రత్యేక కార్మికులుగా గుర్తించి మాకు పింఛన్ ఇప్పించండి.

– గంగారాం, కార్మికుడు

మండే ఎండలను లెక్క చేయకుండా..

అసలే వేసవి వచ్చేసింది. భానుడి భగభగలు మొదలయ్యాయి. కానీ వీరు ఎండలను సైతం లెక్కచేయకుండా ఎండలోనే కండలను కరిగించి రాళ్లను ఉలితో తొలచి రోళ్లను తయారు చేస్తున్నారు. రోళ్ల తయారు చేసేటప్పుడు తరుచూ చేతులకు ఉలి దెబ్బలు తగలడంతో గాయాలబారిన పడుతున్నారు. మగవారు రోళ్ల తయారు చేస్తే ఆడవారు వాటిని గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తుంటారు. ఒక్క రోలు తయారు చేసి విక్రయిస్తే రోజుకు రూ.300–400 వస్తున్నాయని చెబుతున్నారు.